సాక్షి
అనకాపల్లి
బుధవారం ၊ 7 ၊ ఆగస్టు ၊ 2024



ఏయూ వీసీ ఆకస్మిక తనిఖీ

విశాఖ: ఏయూలో పలు విభాగాలను ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.



క్యాన్సర్ స్క్రీనింగ్

గాజువాక: హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సిబ్బంది దిబ్బపాలెంలో 61మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.



ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాసం రెండో రోజు మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో పూజలు జరిపారు.

న్యూస్‌రీల్

తొలి రోజు నామినేషన్లు నిల్

మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా రిటర్నింగ్ అధికారి హోదాలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ నోటిఫికేషన్ జారీ చేశారు. కాగా.. తొలి రోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్ వేయడానికి గడువు ఉంది. 14న నామినేషన్ల పరిశీలన, 16వ తేదీని ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. 30న పోలింగ్ నిర్వహిస్తారు.

టేకు ప్లాంటేషన్‌లో జాగ్రత్తలు తీసుకోండి..



టేకు ప్లాంటేషన్‌పై సూచనలు ఇస్తున్న పీసీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి

గొలుగొండ: టేకు ప్లాంటేషన్ సంరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని విశాఖపట్నం సర్కిల్ పీసీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి సూచించారు. గొలుగొండ సెక్షన్ గొలుగొండ బీటు అచ్చయ్యపేట వద్ద కొత్తగా ప్లాంటింగ్ చేసిన టేకు తోటను ఆయన మంగళవారం పరిశీలించారు. టేకు ప్లాంటేషన్ అవలంబించాల్సిన చర్యలు తెలుసుకొని, అటవీ సంరక్షణ పట్ల బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్, ట్రెయినీ ఐఎఫ్‌ఎస్ అబ్దుల్ రావూఫ్, కృష్ణదేవిపేట రేంజర్ వెంకటరమణ, గొలుగొండ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్ ఉన్నారు.

లారీ ఎక్కిన విమానం



లారీపై విమానాన్ని కలకత్తా నుంచి చెన్నై తీసుకెళ్తున్న దృశ్యం

నక్కపల్లి: విమానం ఏంటి.. లారీ ఎక్కడమేంటని ఆశ్చర్యపోతున్నారా! ఆకాశంలో ఎగిరే విమానం రోడ్డు మీద వెళ్లే లారీపై కనిపించిందంటే నమ్మలేకపోతున్నారా! నిజంగా ఇది నిజమేనండీ.. మంగళవారం ఒక విమానం కలకత్తా నుంచి చెన్నైకి వెళ్లే లారీ ఎక్కి రోడ్డు మార్గాన ప్రయాణించింది. మరమ్మతులకు గురయిన ఈ విమానాన్ని కలకత్తా నుంచి ఒక పెద్ద ట్రాలీ లారీ మీద చెన్నై తీసుకెళ్తున్నారు. ఈ విమానం రాకపోకలకు పనికి రాకపోవడంతో చెన్నైకి చెందిన ఒక వ్యక్తి కొనుగోలు చేసి దీన్ని హోటల్‌గా తయారు చేసేందుకు తీసుకెళ్తున్నట్లు లారీ సిబ్బంది తెలిపారు. 16వ నెంబరు జాతీయరహదారి మీదుగా లారీపై వెళ్తున్న ఈ విమానాన్ని పలువురు ఆశ్చర్యంగా చూశారు. హోటల్ దగ్గర సిబ్బంది కొద్దిసేపు ఆపడంతో చుట్టుపక్కల వారు వచ్చి విమానాన్ని వింతగా చూశారు.

నాడు మత్స్యకార భరోసా.. పేరుకు తగ్గట్టే వేట నిషేధ సమయంలో పూట గడవని గంగపుత్రులకు భరోసా కలిగించిన పథకం. చంద్రబాబులా ఏదో బిచ్చం వేసినట్టు కాకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు వేల నుంచి పది వేల రూపాయలకు వేట నిషేధ భృతిని పెంచింది. నిషేధ సమయంలోనే ఠంఛనుగా అందించింది.

నేడు గంగపుత్రుల్లో గుబులు.. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా భృతిని ఇవ్వలేదు సరికదా.. డీజిల్ వాడకం మెలికను పెట్టి లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు కొత్తగా రీసర్వే చేపట్టి అర్హుల ఏరివేతకు పూనుకున్నారు. ఆ పేరుతో టీడీపీకి అనుకూలంగా ఉన్నవారికి లబ్ధి చేకూర్చి, మిగతా వారికి అన్యాయం చేసే కుట్ర జరుగుతోంది.



గంగపుత్రుల బెంగ తీరదా..?

- వేట నిషేధ భృతిని ఎగ్గొట్టేందుకు కూటమి సర్కార్ కుయుక్తులు
- లబ్ధిదారుల ఏరివేతకు రీసర్వే విధానం
- వేట నిషేధం ముగిసి నెలన్నరైనా భరోసా ఊసేలేదు
- జిల్లాలో 11,500 మంది లబ్ధిదారులు

సాక్షి, అనకాపల్లి: చేపల వేట నిషేధం ముగిసి నెలన్నర దాటినా భరోసా ఊసే లేదు. మత్స్యకారులు జూన్ 15 నుంచి ఉసూరుమంటూనే వేట మొదలుపెట్టారు. రెండు నెలల నిషేధ కాలంలో చేసిన అప్పులు తీర్చలేక సతమతమవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిషేధ సమయంలోనే భృతి అందించేది. సార్వత్రిక ఎన్నికల ముందు కోడ్ అమలులోకి రావడంతో గత ప్రభుత్వం భరోసా సొమ్ము అందించలేకపోయింది. **అధికారంలోకి వచ్చిన వెంటనే పంపిణీ చేయాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు పూనుకోలేదు సరి కదా.. లబ్ధిదారుల ఎంపికపై రీసర్వే విధానాన్ని తెర మీదకు తెచ్చి వారి గొంతు కోసే కుట్ర చేస్తోంది.** లబ్ధిదారుల వివరాలు, వారు మత్స్యకార భరోసాకు అర్హులా కాదా అనే దానిపై రీసర్వే నిర్వహిస్తామని రాష్ట్ర మత్స్యకార శాఖ మంత్రి ప్రకటించారు. దీనికి అనుసంధానంగా డీజిల్ వాడకపోతే పరిహారానికి అనర్హులు అనే నిబంధన వారికి శరాఘాతంగా మారింది. దీనికి మినహాయిపు ఇవ్వకపోతే అర్హులైన 11,500 మత్స్యకారుల్లో దాదాపు 3 వేల మంది పరిహారానికి దూరమవుతారని ఆందోళన చెందుతున్నారు.

మినహాయింపు దక్కుతుందా..?

చేపల వేట నిషేధ సమయంలో పరిహారాన్ని అం**దుకునేందుకు బోట్లలో డీజిల్ వినియోగాన్ని ఒక అర్హతగా తీసుకోవడం పరిపాటి. అయితే కొన్ని బోట్లను మిగిలిన వారు సర్దుబాటు చేసుకోవడం, ఒకే బోటులో రెండు మూడు కుటుంబాలకు చెందిన వారు వేటకు వెళ్లడంతో ఒక్కోసారి డీజిల్ వాడే** అవసరం కొందరు మత్స్యకారులకు ఉండకపోవచ్చు.

డీజిల్ వాడకపోతే పరిహారం పొందేందుకు అనర్హులు అనే నిబంధన గతంలోనూ ఉన్నప్పటికీ వైఎస్ జగన్ సర్కారు పెద్ద మనసుతో మినహాయింపు ఇచ్చి పరిహారాన్ని అందించేది. జిల్లాలో 73 కిలో మీటర్ల మేర ఉన్న సముద్ర తీరాన్ని ఆనుకొని ఆరు మండలాల పరిధిలోని 31 మత్స్య గ్రామాలు ఉన్నాయి. 11,500 మత్స్యకారులు భరోసా అందుకునేందుకు అర్హులు. వారిలో కనీసం 3 వేల మంది డీజిల్ వాడడం లేదని గుర్తించారు. వారికి ఇప్పుడు **మత్స్యకార** భరోసా పడాలంటే కచ్చితంగా **ప్రభుత్వం** నిబంధన నుంచి మినహాయింపు **ఇవ్వాలి. మత్స్యశాఖ** జిల్లా అధికారులు ఇప్పటికే **ఈ విషయంలో** ప్రభుత్వానికి నివేదిక పంపించినట్టుగా తెలుస్తోంది. మత్స్యకార భరోసాపై ప్రభుత్వం నుంచి ఎటువంటి గైడ్‌లైన్స్ రాలేదని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాదరావు చెప్పారు.

ఎన్నికల హామీ ఏమైంది..?



వేట నిషేధ సమయంలో **మత్స్యకారులు** చాలా **ఇబ్బందులు** పడ్డారు. వేట నిషేధం పూర్తయింది. అయినా ప్రభుత్వం మాకు భరోసా ఇవ్వలేదు. వేట నిషేధ సమయంలో మా మత్స్యకారులమంతా 60 రోజులపాటు అప్పు చేసుకుని జీవనం గడిపిన సందర్భాలు చూశాం. ఎన్నికలకు ముందు మత్స్యకారులకు రూ.20 వేల మత్స్యకార భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలు ఏవీ..? తక్షణమే ప్రభుత్వం భరోసా విడుదల చేయాలి.

– చోడిపల్లి కొర్లయ్య, మత్స్యకారుడు, పూడిమడక

మత్స్యకార వెతలు వినపడవా..?



కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వానికి మత్స్యకారుల వెతలు వినపడవా..? వేట నిషేధం ముగిసి నెలన్నర దాటింది. అయినా భరోసాపై స్పందించలేదు. రాష్ట్రంలో ఉన్న అత్యధిక మత్స్యకారులు కూటమి పార్టీలకే ఓట్లు వేశారు. నమ్మిన వారిని మోసం చేయడం తగదు. దీన్నిపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏనాడూ మా మత్స్యకార భరోసా ఆగలేదు. ఇప్పుడు ఎగ్గొట్టేందుకు రీసర్వే అంటూ కొత్త మెలికలు పెడుతున్నారు.

– చోడిపల్లి శ్రీనివాసరావు, మాజీ మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్

కూటమి నైజం.. ప్రజాస్వామ్యానికి విఘాతం

- బలం లేకపోయినా పోటీ చేస్తామనడం విడ్డూరం
- సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీకి విజయం అందించాలి
- పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ



ఎస్.రాయవరం సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



నర్సీపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ



సమావేశానికి హాజరైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు

నర్సీపట్నం/ఎస్.రాయవరం: ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తేనే దేశం, రాష్ట్రం మనుగడ సజావుగా సాగుతుందని, అడ్డదారుల్లో వచ్చే వారికి గుణపాఠం చెప్పాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లతో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లతో మండలాల వారీగా సమీక్ష జరిపారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గ నాలుగు మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. నర్సీపట్నం, అడ్డురోడ్డు సమావేశాల్లో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. మెజార్టీ ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఉన్నందున పార్టీకి విజయావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పార్టీ నాయకుల సమష్టి కృషితో తప్పకుండా గెలుస్తామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలనే ఉద్దేశంతో పార్టీకి పూర్తి స్థాయి మెజార్టీ ఉన్నందున పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను పార్టీ అభ్యర్థిగా నిలిపారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో మొత్తం ఓటర్ల సంఖ్య 858 కాగా.. అందులో వైఎస్సార్ సీపీకి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు కలిసి 620 పైన ఓట్లు ఉన్నాయన్నారు. కేవలం సుమారు 200 ఓట్లు ఉన్న అధికార కూటమి పోటీ పెడతాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కంటే టీడీపీకి కేవలం 50 ఓట్లే ఎక్కువగా ఉన్నాయని, ఆ పరిస్థితుల్లో కూడా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థిని నిలబెట్టలేదని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రలోభాలతో ఎలాగైనా గెలవాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పోటీకి దింపుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడం ద్వారా మన గౌరవాన్ని మనం కాపాడుకోవాలన్నారు. కూటమి అరాచకాలను శాసన మండలిలో ఎండగట్టే అవకాశం ఉంటుందన్నారు. 60 రోజుల్లోనే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీసే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సంపద సృష్టిస్తానని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు చేతులెత్తేశారని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ సత్తా చాటాలి

మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ అందరి అభిప్రాయం మేరకు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి బొత్స సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్యనారాయణను గెలిపించుకుని వైఎస్సార్ సీపీ సత్తా చాటాలన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎమ్మెల్సీ ఎన్నిక ద్వారా శాసన మండలిలో ప్రస్తావించేందుకు పార్టీకి అవకాశం వచ్చిందన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మనసున్న మంచి మనిషి బొత్స సత్యనారాయణ అని కొనియాడారు. విశాఖ గౌరవాన్ని నిలబెట్టే వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ కూటమి నేతల ప్రలోభాలకు ఏమాత్రం లొంగవద్దని, ఎమ్మెల్సీ ఎన్నిక కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు కావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స గెలుపుతో పార్టీకి ఊపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నం సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు. ఎస్.రాయవరం సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబురాజు, సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ చంటిబాబురాజు, జిల్లా వ్యవసాయ మండల చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ ఆదర్శం



ఆస్పత్రి వద్ద సిబ్బంది వందన సమర్పణ



అవయవ దాన ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్) యజ్జల ఆడివారం(ఫైల్)

- బ్రెయిన్ డెడ్ అయిన పూడిమడక మహిళ
- జీవన్‌ధార ద్వారా అవయవదానానికి అంగీకారం
- ఏడుగురికి పునర్జన్మనిచ్చిన వైనం

అచ్యుతాపురం : రాష్ట్రంలోనే అతి పెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక గ్రామం ఆదర్శంగా నిలిచింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న మత్స్యకార కుటుంబం మానవతకు అద్దం పట్టింది. వివరాలివి. అచ్యుతాపురం మండలంలోని పూడిమడక గ్రామానికి చెందిన యజ్జల ఆడివారం(40) ఈ నెల 3వ తేదీన హైబీపీకి గురైంది. భర్త, ముగ్గురు పిల్లలున్న ఆడివారంను చికిత్స నిమిత్తం అనకాపల్లి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికీ పరిస్థితి చేజారి బ్రెయిన్ డెడ్‌కు గురైందని వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతురాలిని స్వగ్రామానికి తరలించాలని నిర్ణయించారు. ఇంతలో జీవన్‌ధారకు సంబంధించిన ప్రతినిధి మంగ కోమాలోకి వెళ్లిన ఆడివారం కుటుంబాన్ని సంప్రదించి అవయవదానానికి ఒప్పించే ప్రయత్నం చేశారు. ఆడివారం భర్త, పిల్లలు, వారి కుటుంబీకులు, పూడిమడక మత్స్యకార పెద్దలు కలిసి అవయవ దానం చేసేందుకు అంగీకరించారు. తద్వారా ఏడుగురి ఇళ్లల్లో ఈమె వెలుగులు నింపనుంది. మంగళవారం ఉదయం సంబంధిత ఆస్పత్రిలో అవయవ దాన ప్రక్రియ పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు.

అనంతరం పూడిమడకకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. పూడిమడకకు చెందిన వారంతా అంత్యక్రియలో పాల్గొని ఆడివారంను దేవతగా కొలిచారు.

పేదరికం... విషాదం

ఆడివారం కుటుంబం పేదరికంతో కొట్టుమిట్టాడుతోంది. వీరి కుమార్తె ఒకరు అనారోగ్యంతో మృతి చెందారు. ఆ బాధ నుంచి కోలుకుంటున్న తరుణంలో మళ్లీ ఈ విషాదం. ఆడివారంకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ముత్యాలు, కుమారుడు తాతారావు, కుమార్తె రాజేశ్వరి ఉన్నారు. జీవన్‌ధారలో అవయవదానం చేసినందున ఆడివారం మృతదేహానికి విశాఖలోని ఆస్పత్రి వద్ద సిబ్బంది వందనం నిర్వహించారు. అంతే కాకుండా పిల్లలకు చదువు, ఉద్యోగ కల్పన విషయంలో సాయం చేసే అంశాలను పరిశీలిస్తామని సంబంధిత విభాగ సిబ్బంది తెలిపారు.

ఆర్థిక సాయం చేయాలి...

ఆడివారం మా గ్రామానికి దేవత అయ్యింది. ఏడుగురికి పునర్జన్మనిచ్చింది. ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. ఎటువంటి ఆశ, ఆపేక్ష లేకుండా అవయవదానం చేసిన ఆడివారం కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. మా మత్స్యకార గ్రామానికి ఆడివారం కుటుంబం వంటి వారి సేవాతత్పరత హృదయంతో మంచి పేరు వచ్చింది. ఆరోగ్య శాఖ మంత్రి, కలెక్టర్, జిల్లా మంత్రి, ఎంపీ, ఎంఎల్‌ఏలు ఈ కుటుంబాన్ని పరామర్శించి తగిన విధంగా ఆదుకోవాలని పూడిమడక వాసుల తరఫున కోరుతున్నాను.

–మేరుగు అప్పలనాయుడు

రిసార్ట్ పాలి‘ట్రిక్స్’

- కార్పొరేటర్లను భీమిలి తరలించిన టీడీపీ
- పోలింగ్ సమయానికి తీసుకొచ్చేందుకు సన్నాహాలు
- నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు
- ప్రలోభాలే అజెండాగా కూటమి నేతలు
- వైఎస్సార్ సీపీ, ఇండిపెండెంట్లకు ఒక్కొక్కరికీ రూ.3 లక్షల ఎర



సాక్షి, విశాఖపట్నం : గ్రేటర్ రాజకీయాలు రిసార్టుకు చేరుకున్నాయి. అధికారంలోకి వచ్చాక జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను కూటమి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తమకు అలవాటైన కొనుగోళ్ల ఎరతో కార్పొరేటర్లను మభ్యపెట్టింది. తమకు మద్దతునిచ్చిన కార్పొరేటర్లు ఎక్కడ చేజారిపోతారోనన్న భయంతో క్యాంపు రాజకీయాలు చేస్తోంది. అందరినీ భీమిలిలోని ఓ రిసార్టుకు తరలించేసింది. పోలింగ్ సమయానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. మరోవైపు విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తోంది.

మధ్యాహ్నం 2 గంటల వరకూ పోలింగ్

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. సాయంత్రం ఫలితాలను వెల్లడించనున్నారు. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో 3 సార్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగ్గా.. మూడు పర్యాయాలూ వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగరేసింది. అందుకే ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మొత్తం వైఎస్సార్‌సీపీ నుంచి 10 మంది, టీడీపీ నుంచి 10 మంది బరిలో ఉన్నారు. ఈ 20 మందికి 97 మంది కార్పొరేటర్లు ఓట్లు వేయనున్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ఓటు వినియోగించుకోడానికి దూరంగా ఉంటున్నట్లు సీపీఐ కార్పొరేటర్ గంగారావు ప్రకటించారు. అంటే 96 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఏ అభ్యర్థికైతే ఎక్కువమంది కార్పొరేటర్లు బలపరస్తూ ఓటు వేస్తారో వారే ఏడా దిపాటు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతారు.

> **గ్రేటర్‌లో మొత్తం 97 మంది కార్పొరేటర్లు**
>
> **ప్రస్తుతం వైఎస్సార్ సీపీ బలం-47, టీడీపీ-37, జనసేన-8, బీజేపీ-1**
>
> **కూటమికి ఒక సీపీఎం కార్పొరేటర్ మద్దతు, ఎన్నికకు దూరంగా సీపీఐ**

రిసార్టులో రసవత్తరం..!

అధికార టీడీపీ నేతలకు ఓటమి భయం పట్టుకొని తమతో వచ్చిన కార్పొరేటర్లకు రూ.3 లక్షలు చొప్పున అందించినట్లు సమాచారం. మంగళవారం మధ్యాహ్నం తమ మద్దతు కార్పొరేటర్లను రిసార్టుకు చేర్చగా.. వీరిలో కొందరు కార్పొరేటర్లు మనసు మార్చుకొని ఇంటికి వెళ్లిపోతామని చెప్పడంతో టీడీపీలో మళ్లీ భయం పట్టుకుంది. వారిని బుజ్జగించే పనిని కీలక కార్పొరేటర్లకు అప్పగించారు. రిసార్టు దగ్గర జామర్లు కూడా అమర్చినట్లు సమాచారం. ఇండిపెండెంట్ కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకునేందుకు లాబీయింగ్ నడుపుతున్నారు.

ఇవీ బలాబలాలు

గ్రేటర్‌లో 98 మంది వార్డులుండగా ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లున్నారు. వీరిలో వైఎస్సార్ సీపీ నుంచి 58 మంది, టీడీపీ నుంచి 29, జనసేన నుంచి ముగ్గురు, ఇండిపెండెంట్లు నలుగురు, సీపీఐ, సీపీఎం, బీజేపీల నుంచి చెరో కార్పొరేటర్ విజయం సాధించారు. పార్టీలు మారిన తర్వాత ప్రస్తుత బలాబలాలు చూస్తే.. వైఎస్సార్ సీపీలో 46 మంది, టీడీపీలో 37, జనసేనలో 8, సీపీఐ, సీపీ ఎం, బీజేపీలకు ఒక్కొక్కరుండగా స్వతంత్రులు ముగ్గురున్నారు. మొత్తంగా ప్రస్తుతం చూస్తే.. ఒక ఇండిపెండెంట్‌తో కలిపి వైఎస్సార్ సీపీకి 47, కూటమికి 47తో పాటు ఇద్దరు ఇండిపెండెంట్స్ మద్దతుతో కలిపి మొత్తం 49 మంది కార్పొరేటర్ల బలం ఉంది. ఈ లెక్కన వైఎస్సార్‌సీపీ కంటే కూటమికే బలం ఉన్నా భయంతో బిక్కుబిక్కుమంటుండటం గమనార్హం. పోటీలో ఉన్న 10 మంది టీడీపీ కార్పొరేటర్లే కావడంతో జనసేన, బీజేపీతో పాటు మద్దతునిస్తున్న ఇండిపెండెంట్లు కూడా గుర్రుగా ఉన్నారు.

క్లుప్తంగా

ఇన్‌స్పైర్‌తో విద్యార్థుల్లో నైపుణ్యాలకు పదును



ఇన్‌స్పైర్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

నర్సీపట్నం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఇన్‌స్పైర్ నమోదుపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి అప్పారావు మాట్లాడారు. పిల్లల్లో దాగి ఉన్న జ్ఞానం, అభిరుచులను జాతీయ స్థాయిలో ప్రతిబింబించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు నామినేషన్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎన్నికైన ప్రతి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలు నేరుగా విద్యార్థి అకౌంట్‌కు జమ చేస్తుందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులతో కలిసి ఇన్‌స్పైర్ బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 12 మండలాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు, ఎంఈవో నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'మాలల హక్కుల్ని కాలరాసేందుకు కేంద్రం కుట్ర'

- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అనకాపల్లిలో ఐదు వేల మందితో త్వరలో సమావేశం

చోడవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో క్రీమీలేయర్ సాకుగా చూపి మాలల హక్కులను కాలరాసేందుకు కుట్రలు పన్నుతోందని, దీన్ని వ్యతిరేకిస్తూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఐదు వేల మంది దళితులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సియ్యాద్రి శ్రీనివాసరావు హెచ్చరించారు. సుప్రీం కోర్టు తీర్పు, కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలి పట్ల మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దళిత, బహుజన సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాసరావుతోపాటు దళిత నాయకులు వేచలపు ప్రకాష్, కొత్తపల్లి శ్రీనివాసరావు, బోని నగేష్, బూసి కోటి, పావాడ సన్యాసిరావు, నడుపూరి తాతాలు, మరియమ్మ తదితరులు మాట్లాడుతూ కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. వర్గీకరణ మోదీ కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఎస్సీలకు ఉన్న 15 శాతంలో వర్గీకరణ దేనికని ప్రశ్నించారు. దీనిపై అప్పీలు చేస్తామన్నారు. మండల స్థాయిలో దళితులను కూడగట్టి భారీ ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆమె పరుగు చిరుత కంటే వేగం.. అడ్డంకులు ఎదురైనా పతకాల వేట ఆమె లక్ష్యం. ట్రాక్‌లో దిగిందంటే ట్రెండ్ సెట్ చేయాల్సిందే. ఆమె ట్రాక్ రికార్డు చూస్తే ఔరా అనాల్సిందే. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అందరి చూపు ఆమెపైనే ఉంది. ఒలింపిక్స్‌లో భారత్ తరపున ఫాస్టెస్ట్ వుమెన్ హర్డిలర్‌గా పోటీకి సిద్ధమైంది. విజయానికి రెప్పపాటు దూరంలో ఉంది. ఈ విశాఖ కెరటం జ్యోతి యర్రాజీకి రిలయన్స్ ఫౌండేషన్ సహకారం లభించింది. ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో నేడు అథ్లెటిక్ హీట్స్‌లో జ్యోతి తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఒలింపిక్స్ పతకం తీసుకు రావాలి.. విశాఖ మురిసిపోవాలి.. జాతి గర్వించాలి...ఆల్ ద బెస్ట్ జ్యోతి..



జ్యోతి వెలగాలి జాతి మురవాలి

విశాఖ స్పోర్ట్స్ : జ్యోతి తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా, ఆమె తల్లి కుమారి, గృహిణి. జ్యోతి విశాఖలోని పోర్ట్ హైస్కూల్ చదువుకుంది. పోర్టు స్కూల్‌లో చదివే పిల్లలకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. 100, 200, 400 మీటర్లు, రిలేల్లో సైతం పాల్గొనేది. అక్కడ జ్యోతి రాణిస్తుండడంతో క్రీడాప్రాధికార సంస్థకు చేరింది. శాప్ కోచ్ రమేష్‌వద్ద రెండేళ్లు శిక్షణ పొందింది. అక్కడి నుంచి 2019లో గుంటూరులో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చేరింది. గాయంతో పాటు కోవిడ్‌తో శిక్షణ అటకెక్కింది. అప్పటి వరకూ జాతీయ స్థాయిలో రాణించిన జ్యోతి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఇక్కడే మలుపు తిరిగింది. లెగ్ రన్నర్ కాస్తా ఫాస్టెస్ట్ రన్నర్‌గా రూపాంతరం చెందింది. బ్రిటీష్ కోచ్ జేమ్స్ హిల్లియర్ శిక్షణలో పొడుగు కాళ్ల అథ్లెట్ జ్యోతి హార్డిలర్‌గా మారిపోయింది. అంతర్జాతీయ పతకాలతో ప్రపంచ ర్యాకింగ్‌లో 24కు చేరింది.

ఒలింపిక్స్‌కు భారత్ తరఫున వుమెన్ ఫాస్టెస్ట్ హర్డిలర్ పోటీకి విశాఖ అథ్లెట్ జ్యోతి సిద్ధమైంది.

జాతీయ రికార్డు

2022లో మే 10వ తేదీ. చాలా ఏళ్లుగా నమోదైన వంద మీటర్ల వుమెన్ హార్డిల్స్ రికార్డు బద్దలైంది. అప్పటి వరకు అనురాధా బిస్వాల్ పేరిట ఉన్న రికార్డును జ్యోతి 13.23 సెకన్లలోనే పూర్తి చేసి జాతీయ రికార్డును నెలకొల్పింది. తన రికార్డును తనే పలు మార్లు బ్రేక్ చేసింది.

అనర్హతే ఆరంభమైంది

2022 ఆసియా క్రీడల్లో వంద మీటర్ల హార్డిల్స్‌లో జ్యోతి ఫాల్స్ స్టార్ట్ చేసిందంటూ అనర్హత వేటు వేశారు. అప్పుడప్పుడే అంతర్జాతీయ పోటీల్లో పతకాల వేట మొదలెట్టింది. అనర్హతను ధైర్యంగానే ఎదుర్కొంటూ అథ్లెటిక్ సమాఖ్య సహకారంతో అపీల్ చేసింది. చివరికి చైనా అథ్లెట్‌దే తప్పుగా తేలడంతో 12.91 సెకన్లలో పూర్తి చేసిన జ్యోతికి రజత పతకం ప్రకటించారు.

కాంటింజెంట్‌తో శిక్షణ తీసుకున్నా...



ఒలింపిక్స్‌లో అర్హత సాధించాలని కలగన్నా. అది నెరవేరింది. పోలాండ్‌లో అథ్లెటిక్ కాంటింజెంట్‌కు జరిగిన శిక్షణలో పాల్గొన్నా. వంద మీటర్ల హార్డిల్స్‌లో సత్తా చాటేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నా. పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది. బుధవారం హీట్స్ జరగనున్నాయి. ప్రస్తుతం ఒలింపిక్ రికార్డు 12.26తో నమోదై ఉంది.

–జ్యోతి యర్రాజీ,
జాతీయ రికార్డు హార్డిలర్

దళితులపై కొనసాగుతున్న వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

చోడవరం రూరల్: దేశంలో దళితులపై, దళితుల కేసులపై సైతం వివక్ష కొనసాగుతోందని, అందుకు చుండూరు దళితుల ఊచకోత కేసే తార్కాణమని దళిత నాయకులు ధ్వజమెత్తారు. 1991 ఆగష్టు 6న జరిగిన చుండూరు ఘటనపై దళిత విముక్తి ఆధ్వర్యంలో స్థానికంగా మంగళవారం నిరసన సభ నిర్వహించారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకట రమణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో దళిత నాయకులు పి.సత్యనారాయణ, బి.అప్పారావు, నరసయ్య(అనకాపల్లి), బి.సన్యాసమ్మలు మాట్లాడారు. దేశంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా అనేక కేసుల్ని పరిష్కరించినా, చుండూరు దళితుల హత్య కేసు ఎందుకు పరిష్కారం కావడం లేదని ప్రశ్నించారు. 8 మంది అమాయక దళితుల్ని హత్యచేసి 33 ఏళ్లవుతున్నా, కారకులకు ఇప్పటికీ శిక్ష పడకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఈ ఊచకోత కేసులో 13 ఏళ్ల తర్వాత కాస్త న్యాయం జరిగిందనుకుంటే, కేసును తిరగదోడి, సాక్ష్యాధారాలున్నప్పటికీ ప్రభుత్వం, పోలీసుల అండతో నిందితులు నిర్దోషులుగా మారారని ఆరోపించారు. దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రభుత్వాల తీరు కారణంగా నిర్వీర్యమవుతోందని వాపోయారు. మోడీ నాయకత్వంలో అనేక రాష్ట్రాల్లో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై ప్రేరేపిత హత్యాకాండ కొనసాగుతోందని ఆరోపించారు. దళిత, బహుజనులకు రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్రకు తెరతీసారని ఆరోపించారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు దళిత, మైనారిటీలు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో చోడవరం నాయకులు హుస్సేన్, బోదయ్య, ఈశ్వరి, ద్వారకానగర్ సంక్షేమ సంఘ నాయకులు గొల్లన్న, తారబీ, పేరమ్మ, జ్యోతి, మోతీ, మహేష్, అప్పయ్యమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితానికి అంతరిక్ష ప్రయోగాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐఐఎస్‌ఎస్‌టీ చాన్సలర్ సురేష్

కొమ్మాది : ఆరు దశాబ్దాల్లో భారతదేశ అంతరిక్ష పరిజ్ఞానం గణనీయంగా వృద్ధి చెందిందని ఖర్చు చేసిన ప్రతి పైసాకు మూడింతలుగా ప్రయోజనం లభించిందని అంతరిక్ష శాస్త్రవేత్త, పద్మభూషణ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌ఎస్‌టీ) చాన్సలర్ డా.బీఎన్ సురేష్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, కండీషన్ మానటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన సామాన్యుడి ప్రయోజనాల కోసం అంతరిక్ష పరిజ్ఞానం అనే అంశంపై ప్రసంగించారు. ఒకప్పుడు అంతరిక్ష ప్రయోగాలకు ఇతర దేశాలపై ఆధారపడిన భారత దేశం నేడు 34 దేశాలకు చెందిన 432 ఉపగ్రహాలను భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఆయా దేశ అవసరాలకు ప్రయోగించే స్థాయికి చేరిందన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికంగా 56 ఆపరేషనల్ శాటిలైట్స్, భారత అంతరిక్ష ప్రయోగశాలల నుంచి ప్రయోగించడం విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ రక్షణ పరిశోధనా సంస్థ మాజీ డైరెక్టర్ జనరల్, కిమ్స్ ఫౌండేషన్ చైర్మెన్ డా. వి. బుజంగరావు, గీతం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

అనకాపల్లి: అనారోగ్యం కారణంగా ఇంటిలో పురుగు మందు తాగి రాపేటి సత్యనారాయణ(69) మృతి చెందినట్లు రూరల్ పోలీస్‌లకు మంగళవారం ఫిర్యాదు అందింది. పోలీస్ స్టేషన్ హెచ్‌సీ భాస్కరరావు కథనం మేరకు వివరాలు.. మండలంలోని వెంకుపాలెం గ్రామానికి చెందిన రాపేటి సత్యనారాయణ కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధను తట్టుకోలేక మంగళవారం పురుగు మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రాపేటి అప్పలనాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి





సీపీఐ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి, పాల్గొన్న పార్టీ శ్రేణులు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

నర్సీపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు తిప్పికొడుతూ, ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ఓడి గెలిచిందన్నారు. ఎన్డీఏ కూటమి 400 స్థానాల్లో గెలిచి, కేంద్రంలో కనీసం ప్రతిపక్షం లేకుండా చేస్తామని ప్రధాని మోదీ ప్రగల్బాలు పలికారని, ఫలితాల్లో ఏమైందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. దేశంలో 43 శాతం నిరుద్యోగ సమస్యే బీజేపీకి మెజార్టీ సీట్లు రాకపోవడానికి కారణమన్నారు. పదేళ్ల అనంతరం రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌లో తన వాణి వినిపించడం పరిణతి చెందిన రాజకీయ నాయకుడు ఉన్నాడనేందుకు నిదర్శనమన్నారు. ఆర్ఎస్ఎస్‌కు అనుగుణంగా కేంద్రంలో పరిపాలన జరుగుతోందని ఆరోపించారు. ఢిల్లీ కేంద్రంగా కాకుండా నాగపూర్ కేంద్రంగా పరిపాలన జరుగుతోందన్నారు. 2029 వరకు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండే అవకాశం కనిపించటం లేదని జోస్యం పలికారు. మణిపూర్ రావణ కాష్టం రగులుతూనే ఉందని, ప్రజా సమస్యలను వదిలి ముఖేష్ అంబానీ కుమారుడి వివాహం గురించి మీడియా మొత్తం గొప్పగా చూపించడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ల శ్రేయస్సే మోదీకి కావాలని, సామాన్య ప్రజానీకం సమస్యలు అవసరంలేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టి వేధించడమే మోడీ ప్రధాన అజెండా అన్నారు. చంద్రబాబు శ్వేతపత్రాలతో ధరల భారాన్ని ప్రజలపై రుద్దడానికి సమాయత్తమయ్యారని ఎద్దేవా చేశారు.

సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఏపీ మరో శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ఎలా అమలు చేద్దామని ఎన్నికల్లో వాగ్దానం చేశారని ప్రశ్నించారు. నేటి చట్టసభల్లో అందరూ కోటీశ్వరులే ఉన్నారు తప్ప, ప్రజల తరపున వాణి వినిపించే కమ్యూనిస్టులు లేకపోవటం విచారకరమన్నారు.

సమావేశంలో కార్యవర్గ సభ్యులు కెవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీనియర్ నాయకులు రావుజగ్గారావు, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, టౌన్ సెక్రటరీ గొల్లు గురుబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు డీసీహెచ్ కాంతి, బి.సుబ్బలక్ష్మి, అప్పలరాజు, మండల కార్యదర్శులు, జిల్లా సమితి శాఖ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు వాచ్‌మన్ డ్యూటీలు అన్యాయం



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

అనకాపల్లి: వీఆర్‌ఏలకు కూటమి ప్రభుత్వం వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించకపోవడమే కాకుండా రాత్రి సమయంలో డ్యూటీలు వేయడం అన్యాయమని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.గంగాధర్‌రావు ఆక్షేపించారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద రాత్రి డ్యూటీలు వేశారని, నిబంధనలకు విరుద్ధంగా వేసిన ఈ డ్యూటీలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. గ్రామాల్లో రెవెన్యూకి సంబంధించిన పనులు నిర్వహించేవారికి, వాచ్‌మన్ డ్యూటీలు వేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎటువంటి ప్రమాదం జరిగిన దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వలేదని, అర్హతలున్నా అటెండర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, డ్రైవర్లుగా జీవితం నెట్టుకొస్తున్నారని వాపోయారు. వీరిని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.రవికుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీఆర్‌ఏలు శాంతి, నాగేశ్వరరావు, ఎం.సంతోష్ కుమార్, సింహాచలం, పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన టీడీపీ, జనసేన కటౌట్లు, ఫ్లెక్సీలు



కటౌట్లు, ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

నాతవరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు మేరకు టీడీపీ నేతల కటౌట్లు, ఫ్లెక్సీలను అధికారులు మంగళవారం తొలగించారు. జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ వచ్చినా, మండలంలో ఎక్కడ చూసినా టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లు ఉన్నాయి. వీటిని తొలగించనీయకుండా అధికార గర్వం ప్రదర్శించారు. దీనిపై సోమవారం ఎంపీడీవో జాగరపు రాంబాబుకు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజుతో పాటు మండలంలోని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో మంగళవారం ఉదయం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి ఫోన్ వచ్చింది. దీంతో మండల వ్యాప్తంగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీ నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీలను అధికారులు దగ్గరుండి మరీ తొలగించారు.

విద్యార్థులా.. వీధి రౌడీలా!

- విద్య నుంచి వికృత చేష్టల వైపు
- దారి తప్పుతున్న విద్యార్థిలోకం
- చెడు అలవాట్లకు బానిసలై అల్లర్లు
- అడ్డుకునే పోలీసులపైనే దాడులు



ఘటనా స్థలం వద్ద స్థానికులను విచారిస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: విద్యార్థుల వికృత చేష్టలు పెచ్చుమీరుతున్నాయి. కౌమార దశలోనే దారి తప్పుతున్నారు. చెడు తిరుగుళ్లు.. గొడవలు.. జల్సాలు.. దురలవాట్లు.. నేరపూరిత ప్రవర్తనతో హద్దుమీరుతున్నారు. చక్కగా కాలేజీకి వెళ్తూ బుద్ధిగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాల్సిన విద్యార్థుల్లో కొంత మంది వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు. ఇంటర్ వయసులోనే గ్యాంగ్‌లు మెయింటైన్ చేస్తూ.. రోడ్డున పడి కొట్టుకుంటున్నారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేస్తూ వారి పరువు తీస్తున్నారు. చేజేతులా వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తాజాగా బాజీ జంక్షన్‌లో నడి రోడ్డులో విద్యార్థులు ముష్టి యుద్ధ ఘటన అందరినీ షాక్‌కు గురిచేసింది. రద్దీగా ఉండే జంక్షన్‌లో వందల మంది జనాల మధ్య విద్యార్థులు వీరంగం సృష్టించారు. సీనియర్, జూనియర్ల మధ్య తలెత్తిన వివాదంలో సీనియర్ విద్యార్థి అన్నయ్య కలగజేసుకోవడంతో పెద్ద ఘర్షణకు దారితీసింది. సినిమా తరహాలో గ్యాంగ్ వార్‌ను తలపించింది. విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి వీధి రౌడీల్లా పిడిగుద్దులు కురిపించుకున్నారు. బాజీ జంక్షన్‌లో వాతావరణం ఒక్కసారిగా భీకరంగా మారిపోయింది. రెండు వర్గాల్లోని విద్యార్థులు ఆవేశంతో ఊగిపోతూ.. ఒకరివెనక ఇంకొకరు పరుగులు తీస్తూ.. దాడులు చేసుకుంటుంటే.. అటుగా వెళుతున్న వారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థం కాక కంగారుపడ్డారు. ఈ వార్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘర్షణ జరిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలోనే గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ ఉంది. అయినప్పటికీ విద్యార్థులు భయం లేకుండా రెచ్చిపోవడం గమనార్హం.

పెడదోవ పడుతున్న విద్యార్థులు

నగరంలో కొంత మంది విద్యార్థి దశలోనే పెడదోవపడుతున్నారు. కొందరు డబ్బు మదంతో రెచ్చిపోతుంటే.. మరికొందరు జల్సాలకు అలవాటు పడి తప్పటడుగులు వేస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని భవితకు బాటలు వేసుకోవాల్సిన వయసులో చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఎటువంటి లక్ష్యం లేకుండా సరదాలు, మందు, డ్రగ్స్ వంటి దురలవాట్లకు బానిసలై విలువైన జీవితాన్ని పాడు చేసుకుంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా కొత్తదనపు అనుభూతి కోసం ప్రయత్నిస్తున్నారు. మరికొందరు తమ జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో మత్తు వైపునకు మళ్లుతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం కూడా పట్టించుకోక పోవడంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తు గతి తప్పుతోంది.

ప్రమాదాలు.. అల్లర్లలో వీరే..

గత కొంత కాలంగా నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, గొడవలు, అల్లర్ల ఘటనల్లో విద్యార్థుల పాత్ర అధికంగా ఉంటుండడం గమనార్హం. ఇంటర్‌లోనే మందు కొడుతున్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, ఆపై స్థాయి విద్యలో చెడు అలవాట్ల బారిన పడుతున్నారు. అంతే కాకుండా కొన్నిచోట్ల సంపన్న వర్గాల పిల్లలకు స్పోర్ట్స్ బైక్‌లు, కార్లు, చేతి నిండా సొమ్ము ఉండడంతో వినోదంలో హద్దులు దాటేస్తున్నారు. మరికొన్ని చోట్ల పార్టీల పేరుతో చెలరేగిపోతున్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రుళ్ల వరకు రోడ్లు, ఆలయాలు ఇలా ఎక్కడపడితే అక్కడ మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ ఆ వైపుగా వెళ్లే వారిని భయాందోళనకు గురిచేస్తున్నారు. మరికొందరు గంజాయి సేవిస్తూ మత్తులో జోగుతున్నారు. మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతూ కొందరు, ప్రమాదానికి గురై మరి కొందరు మృత్యువాత పడుతున్నారు.

భయం లేకుండా..

కొంత మంది విద్యార్థులు, యువత భయం లేకుండా విచ్చలవిడితనంగా ప్రవర్తిస్తున్నారు. మరికొందరు మద్యం మత్తులో పోలీసులపై కూడా తిరగబడుతున్నారు. ఇటీవల కాలంలో పోలీసులపై దాడులకు పాల్పడుతున్నది 30 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. విద్యార్థి దశలో పెచ్చుమీరుతున్న వీరిని కట్టడి చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. విద్యార్థులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తే వారి జీవితాలు దెబ్బతింటాయని పోలీసులు భావించినప్పటికీ.. వీరు మాత్రం అదే అదునుగా చూసుకొని రెచ్చిపోతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు.. ఇలా ఎవరి భయం లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

గుర్తించకపోతే ముప్పే

చెడుబాట పడుతున్నట్లుగా గుర్తించాల్సింది తల్లిదండ్రులే. విద్యార్థి దశలో చెడు స్నేహాలతో సిగరెట్, మందుకు అలవాటు పడిన వారు మత్తు పదార్థాల వైపు వెళుతున్నారు. అటువంటి వారిని తల్లిదండ్రులు పట్టించుకోకుంటే చాలామంది డిప్రెషన్‌లోకి వెళ్లే ప్రమాదముంది. వారిపై ఒక కన్నేసి ఉంచాలని పోలీసులు సైతం సూచిస్తున్నారు. పిల్లలతో మంచి సంబంధం ఏర్పరచుకుని.. వారికి సరైన మార్గదర్శనం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే అందించాలి.

సీనియర్, జూనియర్ల మధ్య కొట్లాట

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం గాయత్రీ కళాశాల సీనియర్, జూనియర్ల మధ్య చెలరేగిన గొడవ మంగళవారం తీవ్ర ఘర్షణకు దారి తీసింది. సీనియర్ విద్యార్థిని జూనియర్ కొట్టాడంటూ మొదలైన వాగ్వాదం ఓ సీనియర్ విద్యార్థి అన్న, అతని స్నేహితులు కల్పించుకోవడంతో ఇరువర్గాలు రోడ్డు మధ్యలో బాహాబాహీకి దిగాయి. అరగంటకు పైగా ఘర్షణ జరిగింది. స్థానికుడొకరు 100కు ఫోన్ చేయడంతో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్, గోపాలపట్నం సీఐ సురేష్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దీంతో విద్యార్థులు, యువకులు పారిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కళాశాల యాజమాన్యాన్ని విచారించారు. మరోమారు ఈ విధంగా జరగకుండా కళాశాల యాజమాన్యం కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఘర్షణను కొందరు వీడియోలు తీయగా, వాటి ద్వారా విద్యార్థుల్ని, బయటి వ్యక్తుల్ని గుర్తించి కళాశాలకు పిలిపించారు. వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. ఈ ఘర్షణపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని, ఇలాంటి సంఘటనలు ఇకపై జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్ తెలిపారు.

మోదీ హయాంలో ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న విమర్శ

దేవరాపల్లి: వామపక్ష సంఘాల కృషితో యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న విమర్శించారు. ఈ మేరకు దేవరాపల్లిలో మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దేశంలో కూలీల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేందుకు, వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు పనులు కల్పించేందుకు ఈ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, ఎంపీడీవోలు, ఏపీడీలు తదితర అధికారుల పర్యవేక్షణలో పనులు జరగడంతో పాటు ప్రతీ ఏటా సోషల్ ఆడిట్ నిర్వహిస్తారన్నారు. ఇంతటి పారదర్శకంగా పనులు జరుగుతుండగా.. ఉపాధి హామీ కూలీలు పనులు చేయకుండానే సోమరిపోతుల్లా డబ్బులు తీసుకుంటున్నారని కేంద్ర మంత్రులు దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్ కూలీల బకాయిలను చెల్లించకపోగా, సోషల్ ఆడిట్ సిబ్బంది మాటలు నమ్మి కూలీల పొట్టగొట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకురావడం అన్యాయమన్నారు. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే రూ.129.50 కోట్ల మేర బకాయిలు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ చట్టంపై దుష్ప్రచారం మానుకొని కూలీలకు ఏడాదికి 200 రోజులు పనిదినాలు, రోజుకు రూ.600 కూలీ సొమ్ముతో పాటు అన్ని అలెవెన్సులు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు.

'సెల్ఫ్ సపోర్ట్' ప్రవేశాలు పూర్తి

విశాఖ సిటీ : ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయ్యాయని ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా ఏయూఈఈటీ–2024 పరీక్ష నిర్వహించి కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పూర్తిచేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

అనకాపల్లి : అనకాపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల విషయమై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర ఏపీఐడబ్ల్యుఏ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు.

బాధిత కుటుంబానికి మలసాల భరోసా



ఈశ్వరరావు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : మండలంలో పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సభ్యుడు ద్వారపురెడ్డి ఈశ్వరరావుకు మతిస్థిమితం సరిగా లేక జూలై 12న తిరుపతి రైల్వేస్టేషన్‌లో తప్పిపోయాడు. మంగళవారం అతని కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్లిన ఈశ్వరరావు అక్కడ జనసందోహం మధ్యలో తప్పిపోయారని తెలిపారు. తిరుపతి ఎస్పీతో మాట్లాడి ఈశ్వరరావు ఆచూకీ కనుగొనాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మొల్లేటి శివాజీ, మలసాల కిషోర్, మలసాల కుమార్‌రాజా, బుద్ద నాగేశ్వరరావు, పెదిశెట్టి రమేష్, దొడ్డి కుమార్, నీలకంఠ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామాచార్యులకు ఘన సత్కారం



శ్రీరామాచార్యులను సత్కరిస్తున్న విశాఖ అర్చక సంఘ ప్రతినిధులు

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త, ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులకు మంగళవారం ఇక్కడ ఘనంగా సన్మానం జరిగింది. విశాఖకు చెందిన అర్చక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జోష్యుల కామేశ్వరశర్మ, కార్యదర్శి ఎం. కిషోర్‌కుమార్‌శర్మ, ఇతరులు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 46 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడోరకం	3,000	3,550

అనకాపల్లి సినిమాలు

శివం భజే	: రాజా
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
బడ్డీ	: సత్యనారాయణ స్క్రీన్-2
అలనాటిరామచంద్రుడు	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
పురుషోత్తముడు	: శ్రీసత్య
ఉషాపరిణయం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 316 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అంతన్నారు.. ఇంతన్నారు

పేదలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా తక్కువ ధరకే నిత్యావసరాలు అందించే ప్రజా పంపిణీ వ్యవస్థను టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా పంపిణీ వ్యవస్థ లెక్కలు తేల్చుతామంటు బయలుదేరి అసలుకే మోసం చేశారని పలువురు పేదలు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాయితీపై ప్రతి నెల బియ్యంతో పాటు అందించిన పంచధార, గోధుమలు, రాగి పిండి పంపిణీ చేయకుండా నిలిపేసి కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేయటం సమంజసమేనా? అని ప్రశ్నిస్తున్నారు.

- చివరికి బియ్యంతోనే సరిపెట్టేశారు
- చక్కెర, గోధుమలు, రాగి పిండి కట్
- రేషన్ సరకుల్లో కోత విధించడంపై లబ్ధిదారుల ఆవేదన





ఇంటికొచ్చిన ఎండీయూ వాహనం ద్వారా బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

తుమ్మపాల : రెండు నెలలుగా పేదలకు అందజేసే రేషన్‌లో కోత విధించిన చంద్రబాబు ప్రభుత్వ తీరుతో పేదలు నిరాశతో ఉన్నారు. ఎన్నికలకు ముందు బియ్యం, గోధుమలు, పంచదార, రాగిపిండి వంటివన్నీ ఇస్తామని ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు కేవలం బియ్యంతోనే సరిపెట్టేస్తున్న వైనం పట్ల పేద లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇంటికే నేరుగా రేషన్ అందించే వాహనాలు దండగా అన్నట్లు సీఎం చంద్రబాబు ఈ నెల 5న కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడి ప్రజలను అయోమయానికి గురి చేశారు. దీంతో సంక్షేమాన్ని నేరుగా ఇంటికే అందించి తోడుగా ఉన్న జగనన్న ప్రభుత్వాన్ని ఓడించి కష్టాలు కొని తెచ్చుకున్నామని ఇప్పుడు అనేక మంది వాపోతున్నారు. మళ్లీ రేషన్ కోసం దుకాణాల వద్ద క్యూకట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచదార, రాగి పిండి, గోధుమలు కట్..

టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రెండు నెలల నుంచి నిత్యావసర సరకుల పంపిణీకి చెక్ పెట్టేసింది. కేవలం బియ్యంతో సరిపెట్టి ఎండీయూ వాహనాలను నిలిపేసే ప్రయత్నం చేస్తోంది. మండలం, పట్టణంలో 93 రేషన్ డిపోల ద్వారా 38 ఎండీయూ వాహనాలు గత ఐదేళ్లుగా ప్రతి ఇంటికి సరకులు అందించాయి. మొత్తం 53,712 కార్డులు ఉండగా వాటిలో 2,016 అంత్యోదయ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ ప్రతి నెల దాదాపు 7752.25 మెట్రిక్ టన్నుల బియ్యం, ఒక్కో కార్డుదారుడికి కేజీ చొప్పున పంచదార, రాగి, గోధుమ పిండి రాయితీ ధరకే పంపిణీ చేసేవారు. అలాంటిది ఈ ప్రభుత్వంలో రెండు నెలలుగా బియ్యం తప్ప ఇతర సరకుల పంపిణీని పూర్తిగా కట్ చేసేసారు. అరకొరగా పట్టణంలో కొన్ని డిపోల పరిధిలో గోధుమల పంపిణీ మాత్రమే చేపట్టి అధికార యాంత్రాంగం చేతులు దులుపుకుంటోంది.

బియ్యంతో సరిపెడుతున్నారు..



రెండు నెలలుగా రేషన్ బండి ఇంటికొచ్చి బియ్యం మాత్రమే ఇస్తోంది. ఉట్టి బియ్యంతో నేనెలా బతకాలో అర్థం కావడం లేదు. ఎన్నికలకు ముందు బియ్యంతో పాటు రాయితీపై పంచదార, గోధుమలు, కంది పప్పు, రాగి పిండి కూడా ఇచ్చేవారు. ఇప్పుడు అవేమీ లేవు. కేవలం బియ్యంతో సరిపెట్టేస్తున్నారు. మిగిలిన సరకులు కూడా ఇవ్వమని బతిమిలాడితే సరకులు లేవని, ప్రభుత్వం ఇవ్వలేదని చెబుతున్నారు. నాలాంటి వారికి అవే ఆధారం. పింఛన్ నగదుతో కూరగాయలు, ఉప్పు, కారం, నూనె కొనుక్కుని నెలంతా సరిపెట్టుకునేదాన్ని. ఇప్పుడు పింఛను నగదు సరకులకే సరిపోతుంది.

– భీమవరపు లక్ష్మి, రేబాక

వచ్చిన మేరకు సరకుల పంపిణీ..

గత రెండు నెలలుగా బియ్యంతో పాటు మూడు టన్నుల గోధుమలు పంపిణీ చేస్తున్నాం. గోధుమలు సరిపడినన్ని రాకపోవడంతో పట్టణంలో కొన్ని డిపోల పరిధిలో పంపిణీ చేస్తున్నాం. ప్రతి నెల ఏ సరకులైతే మాకు వస్తున్నాయో వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు పంపిణీ చేస్తున్నాం. ప్రతి నెల 1వ తేదీ నుంచి ఎండీయూ వాహనాలను ఇంటింటికీ పంపించి సరకులు అందించే విధంగా ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేస్తున్నాం. ఈ నెల దాదాపు 60 శాతం పంపిణీ పూర్తి అయింది.

– లీలా శేషుకుమారి, సీఎస్ డీటీ

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శశికళ

తుమ్మపాల : తల్లిపాలతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి అని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవో శశికళ అన్నారు. మండలంలో గొలగాం పంచాయతీ పీటీవీ పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, మిషన్ శక్తి 100 కార్యక్రమంలో భాగంగా తల్లులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ద్వారా అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలనే బిడ్డకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన సేవలతోనే గుర్తింపు



కనకారావు దంపతులను సత్కరిస్తున్నప్ప ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట : రెవెన్యూ ఉద్యోగులు సమర్థవంతంగా పని చేసి ప్రజలకు సేవలందించాలని, అప్పుడే ప్రభుత్వం కూడా విజయవంతంగా నడుస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేసి పదవీ విరమణ చేసిన పి. కనకారావుకు ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారావు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ రాష్ట్రంలో కీలకమైన రెవెన్యూ ఉద్యోగులు ప్రజల ప్రశంసలు పొందడానికి కృషి చేయాలన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే కొణతాలకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తుమ్మపాల : నియోజకవర్గంలో ఉచిత ఇసుక (స్టాక్ పాయింట్)ను తక్షణమే ఏర్పాటు చేసి భవన నిర్మాణ కార్మిక రంగాన్ని, కార్మికులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించినప్పటికీ అమలు చేసే పద్ధతి లోపభూయిష్టంగా ఉందని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎస్. భద్రం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు మొల్లేటి ఈశ్వరరావు, చిన్ని సత్తిబాబు, కె.రామారావు, కె. గణేష్, ఎం.నూకేష్, ఎస్.సత్తిబాబు అన్నారు. ఉచిత ఇసుక స్టాక్ పాయింట్‌ను పట్టణానికి సమీపంలో ఏర్పాటు చేయాలన్నారు. అగనంపూడి స్టాక్ పాయింట్‌లో విశాఖ జిల్లా వారికే ఇసుక అమ్ముతున్నారని, నక్కపల్లి నుండి ఇసుక తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని ఖర్చులతో కలుపుకొని ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు రాగా, ప్రస్తుత ప్రభుత్వంలో టాక్టర్ ఇసుక రూ.9వేలు చెల్లించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇనుము, సిమెంటు, ఇటుక వంటి ఇతర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరగడంతో పేదలు ఇళ్లు రిపేరు చేయించుకోలేకపోతున్నారని, నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారన్నారు. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు పనులు లేక కుటుంబాలు పస్తులతో గడపాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యాన్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

అనకాపల్లి : స్థానిక జాతీయ రహదారిలోని సూకాంబిక ఆర్చి సమీపంలో బోలేరో వ్యాన్ మంగళవారం రాత్రి వైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ శంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి స్థానికుల సహాయంతో తరలించారు. సంఘటనా స్థలాన్ని ట్రాఫిక్ పోలీసులు పరిశీలించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో 15 క్వార్టర్ మద్యం సీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ కె.రమణమ్మ తెలిపారు. ఇందల దేముళ్లు తన ఇంటి వద్ద విక్రయించడానికి వీటిని తరలిస్తుండగా పట్టుకున్నామని, నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

యువతకు ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలైనా రాష్ట్రంలోను, దేశంలోనూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో యువత పెడదోవ పడుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, తపాలా, బ్యాంకింగ్, ఇన్‌స్రూ స్టీల్‌ప్లాంట్ వంటి శాఖల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగావకాశాలు లేక యువత మాదకద్రవ్యాల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రజాప్రతినిధుల్లా నిరుద్యోగులకు వయసులో సడలింపు ఉండదని ఆయన అన్నారు. విశాఖ కేంద్రంగా తక్షణమే రైల్వేజోన్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను నెలకొల్పి వాటి ద్వారా కూడా ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కాళ్ల తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

దేవరాపల్లి: కేరళ వరద బాధితుల కోసం స్థానిక సీపీఎం నాయకులు మండల కేంద్రంలో మంగళవారం విరాళాలు సేకరించారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీపీఎం మండల కార్యదర్శి బీటీ దొర నేతృత్వంలో దేవరాపల్లి మెయిన్‌రోడ్డులో స్థానికుల నుంచి విరాళాలు సేకరించారు.

రైతు సేవా కేంద్రాలతో సత్వర పశు వైద్యం



పింద్రంగి రైతు సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా పశు వైద్యం సకాలంలో అందించేలా పశు వైద్య సహాయకులు అందుబాటులో ఉండాలని స్థానిక పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. మండలంలోని పింద్రంగి, దాలివలస రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్య సేవల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పశుపోషణలో అవసరమైన సలహాలు, సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షేత్రస్థాయికి వెళ్లి వివరించాలని తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 19 వరకూ వేయనున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలలు దాటిన ప్రతీ పెయ్యితో సహా 37 వేల ఆవులు, గేదెలకు టీకాలు వేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ గాలి కుంటు టీకాలను పశువైద్య సహాయకులు వేయాలన్నారు. సెప్టెంబర్ 1 నుంచి దేశ వ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన జరగనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నెలల వ్యవధిలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పశువైద్య సహాయకులకు తెలిపారు. పశుగణనలో భాగంగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ళు, పందులు, శునకాలను నమోదు చేయాలన్నారు. ఆయన వెంట పశువైద్య సహాయకుడు కె.గోపి, సంతోష్ పాల్గొన్నారు.

శరవేగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం



గొండుపాలెం హైస్కూల్లో శ్లాబ్ నిర్మాణ పనుల్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కనకమల్లీశ్వరి

కె.కోటపాడు: గొండుపాలెం హైస్కూల్లో అదనపు భవన నిర్మాణంతో తరగతి గదుల సమస్య పూర్తిగా తొలగనున్నట్లు సర్పంచ్ బండారు కనకమల్లీశ్వరి తెలిపారు. మనబడి–మన భవిష్యత్ ఫేజ్-2 నిధులతో పాఠశాలలో జరుగుతున్న మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంగళవారం శ్లాబ్ పనులు జరిపారు. సర్పంచ్ కనకమల్లీశ్వరి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సమగ్ర శిక్ష సైట్ ఇంజినీర్ అప్పలనాయుడు మాట్లాడుతూ పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవన నిర్మాణంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు రూ.14 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రొంగలి నాగేశ్వరరావు, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, పీఈటీ రోహిణి, ఉపాధ్యాయులు నారాయణరావు, రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యమే మేలు



జీవన ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి రంగాచారి

తుమ్మపాల : ప్రకృతి సేద్యమే మేలని, అలా పండించిన పంటలే ఆరోగ్యకరమైనవని మండల వ్యవసాయ అధికారి పీయూబీ రంగాచారి అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో జీవన ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా 20 కేజీల పశువుల పేడకు అర లీటరు పొటాషియం సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియా కలిపి నీడ ప్రదేశంలో రెండు మూడు రోజులు ఉంచాలన్నారు. ఆ తర్వాత పొలంలో వేసుకోవడం ద్వారా పంటకు పొటాష్ పోషకం సమృద్ధిగా లభ్యమవుతుందన్నారు. తద్వారా రైతు పొటాష్ కొనుగోలుకు అయ్యే ఖర్చు ఆదా అవుతుందన్నారు. బీజామృతం తయారీ, దానివల్ల ఉపయోగాలు రైతులకు తెలిపారు. అదే విధంగా వరి నాట్లు నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు చొప్పున కాలిబాట ఏర్పరచుకోవాలన్నారు. తద్వారా గాలి, సూర్యరశ్మి అధికంగా లభించి చీడపీడలు ఆశించడం తక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జ్యోతి మోహన్, రైతులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

తుమ్మపాల : రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ సభ్యులతో పాటు విద్యార్థులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఆర్వో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు బి.బాబ్జి, జిల్లా కార్యదర్శి జి. ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా జిల్లాలో వసతి గృహాలు దయనియ పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. భవనాలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపోతూ, వర్షానికి కారిపోతున్నాయని తెలిపారు. విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉంటున్నారన్నారు. మరుగుదొడ్లు, గదులు లేక తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని, భవనాలను పునర్నిర్మించాలన్నారు. గిరిజన వసతి గృహాల్లో నిర్దేశించిన మేర ఉద్యోగులను నియమించకపోవడం వల్ల విద్యార్థుల మెస్ చార్జీల నుంచి వారికి జీతాలు ఇవ్వడం వల్ల విద్యార్థులకు సరైన భోజనం అందటం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టి సారించని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి, సతీష్, రంజిత, రాజేశ్వరి, వివిధ ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనల పేరిట వేధింపులు తగదు



డీఎస్పీ అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

కశింకోట : అనకాపల్లిలో ట్రాఫిక్ నిబంధనల పేరుతో పోలీసులు అడ్డదిడ్డంగా కేసులు పెడుతూ ప్రజలు, వాహన చోదకులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని పలు ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఇటువంటి చర్యలకు స్వస్తి పలకాలని కోరుతూ డీఎస్పీ అప్పలరాజును జిల్లా ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చిన్ని యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, ఆర్య వైశ్యుల సంక్షేమ సంఘం ప్రతినిధి బొడ్డు సోమరాజు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొబ్బిలి గోవింద రాజు, ఆర్య వైశ్య యువజన సంఘం ప్రతినిధి ఉప్పల సాయి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధి సాయిబాబు, నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధి దుర్గారావు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో హెల్మెట్ లేకపోతే ట్రాఫిక్ పోలీసులు ఉగ్రవాదులను పట్టుకున్నట్లు సాధారణ వాహన చోదకులను పట్టుకుని విపరీతంగా కేసులు రాస్తున్నారని ఆరోపించారు. అలాగే సెల్లార్లు లేని షాపింగ్ కాంప్లెక్స్‌లపై చర్యలు తీసుకోవడం లేదని, అదే చిన్న చిన్న షాపుల ముందు వాహనాలు పెడితే మాత్రం ఫొటోలు తీసి కేసులు రాస్తున్నారన్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడమే దీనికి కారణమన్నారు. ప్రజల ఇబ్బందులను సానుభూతితో అర్థం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు నాయిడు

అనకాపల్లి : క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడకుండా ఏడాదికి రెండు సార్లు పరీక్షలు చేసుకోవాలని శ్రీవెంకటేశ్వర నర్సింగ్‌హోమ్ వైద్యుడు డి.డి.నాయుడు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో యోగా శిక్షకుల ఆధ్వర్యంలో క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హృద్రోగ సమస్యలు రాకుండా ధూమపానం, మద్యం, పిండి పదార్థాలు, పచ్చళ్లు, వేపుళ్లు, ఫాస్ట్‌ఫుడ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలని, ఎక్కువగా కాయకూరలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని తెలిపారు.

నిత్యం నడక, యోగ, ఈత, సైక్లింగ్, వ్యాయామం చేయడం వల్ల గుండె వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు భీశెట్టి దొరమ్మనాయుడు, సభ్యులు పెంటకోట సుబ్రహ్మణ్యం, గంగాధర్, కోలపర్తి కన్నబాబు, భాగ్యలక్ష్మి, ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధి నిర్ధారణకు ఉచిత పరీక్షలు



జమాదులపాలెంలో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

కశింకోట: ఫ్లోరోసిస్ వ్యాధి నిర్ధారణకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని ఆ వ్యాధి నియంత్రణ జిల్లా అధికారి గిరిధర్ కోరారు. మండలంలోని జమాదులపాలెంలో విద్యార్థులకు ఫ్లోరైడ్ వ్యాధిపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్లాక్ సాల్ట్, బ్లాక్ టీ, పొగాకు, బోరు నీరు ఎక్కువగా వినియోగిస్తే ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారన్నారు. హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎల్‌హెచ్‌పీ స్మైలి, ఏఎన్ఎం చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పల్లపు భూముల్లో జోరుగా వరి నాట్లు



సాగరంలో వరి నాట్లకు సిద్ధంగా ఉన్న కూలీలు

మాడుగుల రూరల్ : పల్లపు భూముల్లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. తారకరామ, పెద్దేరు జలాశయ ఆయకట్టు భూముల్లో ఖరీఫ్ వరినాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. దీంతో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. తారకరామ, పెద్దేరు, కోనాం జలాశయం సాగునీటిని ఇటీవల విడుదల చేశారు. దీంతో ఈ జలాశయాలు దిగువన గల పంట భూముల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి.